క్లుప్తంగా

మంత్రి ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేత



మంత్రి ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నూతన కార్యవర్గం

ధర్మపురి: ఇటీవల నూతనంగా ఎన్నికైన విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం గురువారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి ఈశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, తదితరులున్నారు.

నిధులు మంజూరు

వెల్గటూర్: మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మండలంలోని స్తంభంపల్లి శివారులోని సర్వేనెంబర్ 1090లో రెండెకరాల విస్తీర్ణంలో రూ.2 కోట్లతో అంబేద్కర్ విజ్ఞాన భవన్ నిర్మాణానికి గతంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ స్థలాన్ని పరిశీలించారు. నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం గురువారం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

మెట్‌పల్లి: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం ఓబీసీ బిల్లును ప్రవేశపెట్టాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క గురువారం కోరారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఆమె హర్షం వ్యక్తంచేశారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో బిల్లు ఆమోదం కోసం ఎంతో ప్రయత్నించారని, కానీ నాటి పరిస్థితుల దృష్ట్యా సాధ్యం కాలేదన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత మోదీ ప్రభుత్వం దీనిపై దృష్టిసారించడం అభినందనీయమన్నారు. అలాగే ఓబీసీ బిల్లును కూడా ప్రవేశపెట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రైతులకు సన్మానం

మెట్‌పల్లిరూరల్: మండలంలోని జగ్గసాగర్‌లో భాద్రపద శుద్ధ షష్టి భగవాన్ బలరామ జయంతి సందర్భంగా గురువారం రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో పలువురు రైతులను సన్మానించారు. కార్యక్రమంలో పెద్ద అంజయ్య, రవి, రాజేందర్, రాజారెడ్డి, రాజేశ్, గంగాధర్, రాజ్‌పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మకు బోనం




పూజలు చేస్తున్న వీడీసీ సభ్యులు

మెట్‌పల్లిరూరల్ : మండలంలోని వెల్లులలో కట్టమైసమ్మ తల్లికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనం సమర్పించారు. పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు అంజయ్య, సభ్యులు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం ఎన్నికలు

జగిత్యాల: జిల్లాలోని పెరిక కుల సంఘానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల ప్రధాన అధికారి లింగారెడ్డి తెలిపారు. భాగ్యరాజ్ ఫంక్షన్‌హాల్‌లో పెరిక కుల సమావేశం జరిగింది. జిల్లాలోని ఆయా గ్రామాల్లో కులసంఘాల్లో సభ్యత్వం పొందినవారు అక్టోబర్ 8న నిర్వహించే ఓటింగ్ వినియోగించుకోవాలన్నారు. ఈనెల 30 నుంచి వచ్చేనెల 1 వరకు నామినేషన్లు, 4న ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు.

కోనాపూర్ వద్ద మళ్లీ నిలిచిన రాకపోకలు



అప్రోచ్ రోడ్డు పైనుంచి పారుతున్న వరద

సారంగాపూర్: జిల్లా కేంద్రం నుంచి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కోనాపూర్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డుపై నుంచి వాగు ఉప్పొంగుతోంది. దీంతో రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. గురువారం భారీ వర్షం కురవడంతో వరద ప్రవాహం పెరిగింది. అప్రోచ్ రోడ్డు మీదుగా పారుతోంది. పరిస్థితిని ఎస్సై తిరుపతి సమీక్షించారు.

స్వశక్తి భవనం పూర్తయ్యేదెప్పుడు?

- ప్రారంభించి పదకొండేళ్లయినా పూర్తికాని భవనం
- ఉపాధిహామీ నిధులు రూ.22 లక్షలతో ప్రారంభం
- రోజురోజుకూ శిథిలావస్థకు..



సారంగాపూర్‌లో అసంపూర్తిగా స్వశక్తి భవనం

సారంగాపూర్: మండలకేంద్రంలో పదకొండేళ్లయినా స్వశక్తి భవన నిర్మాణం పూర్తికావడం లేదు. భవనం నిర్మాణ పనులు పూర్తయితే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జరిగే కార్యకలాపాలను ఈ భవనంలో కొనసాగించేందుకు 2010–11 సంవత్సరంలో రూ. 22 లక్షలతో ఉపాధిహామీ నిధులతో పనులు ప్రారంభించారు. ఇప్పటికీ భవనంలో పనులు పూర్తికాలేదు.

భవనంలో నిర్వహించే కార్యకలాపాలు

డీఆర్డీఏ పరిధిలోని సెర్ప్, ఉపాధిహామీ పథకం కింద అధికారులు కార్యాలయ సిబ్బంది మహిళలకు, జాబ్‌కార్డు కలిగి ఉన్నవారికి ప్రభుత్వం చేపట్టే పనులు, పథకాలపై అవగాహన కల్పించేందుకు, నెలనెలా ఆర్థిక లావాదేవీలు, బిల్లుల చెల్లింపులు తదితర కార్యక్రమాలను ఈ భవనంలో నిర్వహించనున్నారు. ప్రస్తుతం సెర్ప్ మండలస్థాయి సమావేశాలు సారంగాపూర్ గ్రామ జాగృతి మహిళా సమైఖ్య కార్యాలయంలో, ఉపాధిహామీ కార్యాలయం, సమావేశాలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడంతో పనుల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. ఉపాధిహామీ కార్యాలయం పూర్తిగా ఒకే గదికి పరిమితమైంది. ఫలితంగా సెర్ప్, ఉపాధిహామీ మండలస్థాయి సమావేశాలు నిర్వహించడం అధికారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

నిలిచిపోయిన పనులు

స్వశక్తి భవనం నిర్మాణం పూర్తికాగా ఇంకా పనులు మిగిలి ఉన్నాయి. ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, నీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాల పనులు చేపట్టాల్సి ఉండగా కాంట్రాక్టర్లు ఇప్పటికే పలువురు మారినట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ఉపాధిహామీ కింద నిర్వహించే పనులకు బిల్లులు సకాలంలో వస్తాయో లేదోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా పనులు చేపట్టేందుకు రూ.5 లక్షలు నిలువ ఉన్నాయని, త్వరలో పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్నా, భవనం రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతోంది.

మహిళా సంఘం సభ్యుల వివరాలు..

మండలంలో మహిళా	
స్వశక్తి సంఘాలు	565
మొత్తం సభ్యులు	6650
ఉపాధిహామీ పథకం..	
మొత్తం గ్రామాలు	18
శ్రమశక్తి సంఘాలు	400
శ్రమశక్తి సంఘాల్లోని	
మొత్తం సభ్యులు	7652
జాబ్‌కార్డుల సంఖ్య	6980

భవనం పూర్తయితే సౌకర్యం



భవన నిర్మాణం పూర్తయితే మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. మహిళల కోసం చేపట్టే ప్రత్యేక కార్యక్రమాలపై అధికారులు అవగాహన కల్పించాలని ఉన్నా, స్థలాభావం ఏర్పడుతుంది.

– ముంతాజ్, మండల సమైఖ్య అధ్యక్షురాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



భవన నిర్మాణం పూర్తి చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భవన నిర్మాణం పూర్తయితే సెర్ప్, ఉపాధిహామీ కార్యకలాపాలు నిర్వహించడం సులువుగా ఉంటుంది.

– రాజయ్య, సెర్ప్ ఏపీఎం

మహిళా బిల్లుపై హర్షం



కేక్ కట్ చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: మహిళా రిజర్వేషన్ల బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడంపై పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మహిళా ప్రజాప్రతినిధులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి సరోజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఎంపీపీ జాజాల బీమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం స్థానాలు కల్పించే విధంగా లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం అభినందనీయమని బీజేపీ మెట్‌పల్లి మండల అధ్యక్షుడు రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జగ్గసాగర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. గతంలో పాలించిన రాజకీయ పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏనాడు ఆలోచించలేదని, బీజేపీ ప్రభుత్వ హయాంలో బిల్లు ప్రవేశపెట్టడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వందన, నాయకులు గంగాధర్, రమేశ్, శ్రీనివాస్, సురేశ్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని ఉప్పర్‌నూతి వద్ద ఉన్న ప్రభుత్వ భూమి, నూతిని పరిరక్షించాలని కోరుతూ గురువారం రజక సంఘం నాయకులు తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందజేశానరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లీపూర్‌లోని మెయిన్‌రోడ్డు పక్కన ఉప్పర్‌నూతి ఉండటంతో పాటు, పక్కనే ప్రభుత్వ భూమి ఉండగా కొందరు అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని, చెత్త వేయడంతో దోమల విషజ్వరాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. నాయకులు గణేశ్, గంగాధర్, రాజు, శేఖర్, హరీశ్ ఉన్నారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

జగిత్యాలటౌన్: తమ డిమాండ్ల సాధనకోసం కలెక్టరేట్ ముట్టడి చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పడాల తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కలెక్టరేట్ ముట్టడించారని. విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ వారిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులపై మోపిన కేసులు సత్వరమే ఉపసంహరించుకోవాలని తిరుపతి డిమాండ్ చేశారు. ఆయనవెంట బీజేపీ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

భవనం సీజ్

మెట్‌పల్లి: పట్టణంలోని 14వార్డులో గురువారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఓ భవనాన్ని సీజ్‌చేశారు. వారులోని ఎలియా మెంగు అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నాడని సమీయుద్దీన్, తమీజుద్దీన్ గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు నోటీసు ఇచ్చి హెచ్చరించారు. కొంతకాలం పనులు నిలిపివేసిన ఆయన తిరిగి నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నాడన్న సమాచారంతో అధికారులు భవనాన్ని సీజ్‌చేశారు.



సీజ్‌చేస్తున్న అధికారులు

తడి, పొడి చెత్తపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సారంగాపూర్: తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీ ట్రాక్టర్‌లో కంపోస్ట్ షెడ్లకు తరలించాలని బీర్‌పూర్ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, కార్యదర్శి శిరీష అన్నారు. గురువారం బీర్‌పూర్ మండలకేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న విజయ్‌కుమార్

గొల్లపల్లి : మండలంలోని తిరుమలాపూర్‌కు చెందిన జర్నలిస్టు మహమూద్ అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతిచెందగా గురువారం బాధిత కుటుంబాన్ని నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి నక్క విజయ్ కుమార్ పరామర్శించారు. పార్టీ తరుపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇక్కడ మండల అధ్యక్షుడు కల్లెపల్లి తిరుపతి, నాయకులు అంజి, శ్రీను, మహేందర్, ప్రభాకర్ తదితరులున్నారు.

నేడు 'కొండూరి' పర్యటన

కథలాపూర్: మండలంలోని సిరికొండలో టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ శుక్రవారం పర్యటిస్తారని సింగిల్‌విండో చైర్మన్ చుక్క దేవరాజం తెలిపారు. రూ.50 లక్షలతో నిర్మించిన గోదాంను వారు ప్రారంభిస్తారన్నారు. రైతులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

బియ్యం వితరణ

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేటకు చెందిన శాంతరాజ్ ఆశయ్య కొద్దిరోజుల క్రితం మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి 75 కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, నాయకులు సత్యం, సత్యనారాయణరావు, గంగాధర్, రాజు, సత్తయ్య, తిరుపతి, రాకేశ్, దిలీప్, శ్రీను, శంకరయ్య, మల్లయ్య, రాజు, రాంకి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



పెగడపల్లిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



రాయికల్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు

పెగడపల్లి: తమ సమస్యల పరిష్కారం కోసం మండలకేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె పదకొండో రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపే వరకు తమ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

రాయికల్: మండలకేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మిట్టపల్లి పద్మ, రోజా, లావణ్య, రమాదేవి, పద్మ, రాధ, ఉమాదేవి, సుజాత, గోదావరి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి



రైతులతో మాట్లాడుతున్న కృష్ణారావు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని ఆత్మకూర్ శివారులోని చెక్‌డ్యాం వద్ద కోతకు గురైన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోతకు గురైన ప్రాంతాన్ని గురువారం రైతులతో కలిసి పరిశీలించారు. రోడ్డు కోతకు గురికావడంతో సమీపంలోని రైతులు 15కి.మీ మేర చుట్టూ తిరిగి పంట పొలాలకు వెళ్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసామని చెబుతున్న పాలకులు రైతుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ పలువురు రైతులు, తదితరులున్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు..

కోరుట్ల: పట్టణంలో కొలువుదీరిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం పలు మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు పలు వార్డుల్లో గణనాథులను దర్శించుకొని అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, సత్యనారాయణ, ఎలేటి మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా



అవగాహన కల్పిస్తున్న అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా బుట్టల్లో వేయడంపై ప్రజలకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా కార్యదర్శులు, గ్రామ పారిశుధ్య కమిటీ సభ్యులు ఇంటింటా తిరిగారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వాహనాల్లో వేయాలన్నారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్ పర్యవేక్షించారు.

చౌలమద్దిలో..

మెట్‌పల్లిరూరల్ : మండలంలోని చౌలమద్ది గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలోని పరిశుభ్రత, పారిశుధ్యం, తడి, పొడి చెత్త సేకరణతో పాటు పలు అంశాలపై చర్చించారు. స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, కార్యదర్శి రవి, కారోబార్ రాములు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



ప్రోత్సాహకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

కోరుట్ల: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో అత్యధిక మార్కులతో డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ వొటారి రాజన్న సౌజన్యంతో గురువారం నగదు ప్రోత్సాకాలు అందించారు. బీఏలో 8.57 జీపీఏ సాధించిన అప్సిం సనా, బీఎస్సీలో 8.43 జీపీఏ సాధించిన అఫిఫా మారియం, బీకాంలో 7.86 జీపీఏ సాధించిన సైమా కౌసర్‌కు ప్రిన్సిపాల్ వాసవి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఏటా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వొటారి రాజన్న నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల నరేశ్, అకాడమిక్ కో ఆర్డి నేటర్ బి.నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ధర్మపురి (బుగ్గారం) : బుగ్గారం మండలకేంద్రానికి చెందిన చెట్‌పెల్లి గంగాధర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాశ్ శ్రీకృష్ణ ఫౌండేషన్ ద్వారా రూ.10వేల ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. బుగ్గారంకు చెందిన నక్క విజయ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను పరామర్శించి రూ.5 వేలుర ఆర్థికసాయంగా అందజేశారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దనవేని శంకర్, ఉపాధ్యక్షుడు నగునూర్ నర్సాగౌడ్, అంజిత్‌కుమార్, రెంటం శ్రీధర్, తదితరులున్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఇబ్రహీంపట్నం : మండలంలోని వర్షకొండలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవార ంఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్‌రెడ్డి గురువారం తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం : సైబర్ నేరాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రవివర్మ అన్నారు. గురువారం మండలంలోని ఎర్దండిలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు ఆవశ్యకత, బ్యాంక్ పథకాలపై రుణాలు, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా, ఇన్సూరెన్స్, పావులా వడ్డీ రుణాలు, రుణమాఫీ గురించి తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవివర్మతో పాటు, ఎంపీటీసీ వసంత, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కోరుట్ల : పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో సఫాయి మిత్రా సురక్ష సివిర్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కమిషనర్ రాజేశ్వర్, మెడికల్ ఆఫీసర్ సమీనా తబస్సుం, హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్‌కు నివాళి



కోరుట్ల : కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



రాయికల్ : కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు



గొల్లపల్లి : నివాళి అర్పిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో పలు పార్టీల నాయకులు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కోరుట్లలోని కార్గిల్ చౌక్ వద్ద విగ్రహానికి, మెట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో బాపూజీ చిత్రపటానికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలు పార్టీలు నాయకులు, పద్మశాలీ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్